భూచోళ్లు!



మర్రిపాలెం వుడా లే అవుట్ విద్యుత్ కార్యాలయం పక్కన చదును చేసిన వీఎంఆర్‌డీఏ స్థలం



వుడా లే అవుట్‌లో బోర్డు పెట్టినా.. ఆక్రమణల పర్వం

- ఖాళీ స్థలాలపై కూటమి నేతల కన్ను
- సొసైటీల ముసుగులో ఆక్రమణలకు స్కెచ్
- పేదల పేరిట గుడిసెల ఏర్పాటు
- కొన్నాళ్లు తర్వాత విక్రయం
- భారీగా చేతులు మారుతున్న డబ్బులు
- గ్రీన్‌బెల్ట్‌ను సైతం వదలని అక్రమార్కులు

'భూ'చోళ్లు తిరుగుతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు పాల్పడుతున్నారు. కూటమి నేతల అండదండలు ఉండడంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో పశ్చిమ నియోజకవర్గంలో కబ్జా రాయుళ్లకు రెక్కలొచ్చాయనే ప్రచారం సాగుతోంది. కాలనీల్లోని ఖాళీ స్థలాలను ఆక్రమించి కొన్నాళ్ల తర్వాత వాటిని విక్రయిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో తిలా పాపం తలా పిడికెడు అన్న చందాన భారీగా డబ్బులు చేతులుమారుతున్నాయి.

-విశాఖ విద్య

జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు క్రమేపీ కనుమరుగైపోతున్నాయి. లిటిగేషన్ భూములు, ఖాళీ స్థలాలపై కన్నేసిన కూటమి నేతలు వాటిని కాజేసేందుకు పావులు కదుపుతున్నారు.

ఖాళీ స్థలాలను బేరానికి పెడుతున్న వీఎంఆర్‌డీఏ

52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్ కాలనీలో స్థిర నివాసానికి నగర వాసులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. లే అవుట్ ఏర్పాటు సమయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాలనీలో వేర్వేరు చోట్ల ఖాళీ స్థలాలు విడిచిపెట్టారు. ఇప్పుడు వాటికి డిమాండ్ వచ్చింది. కొంతమంది సొసైటీ ముసుగులో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. వీఎంఆర్‌డీఏ అధికారులు సైతం ప్రజావసరాలను మరిచి, ఖాళీ స్థలాలతో సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లో ఉన్న ఖాళీల స్థలాల గుర్తింపు ప్రక్రియ జోరుగా సాగుతోంది. ఆ స్థలాలను త్వరలోనే వేలం వేస్తాంటూ బోర్డులు పెడుతున్నారు. దీనిలో కొంతమంది కూటమి నేతలు రంగప్రవేశం చేసి తమ అనుచరులకు స్థలాలను కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారనే ప్రచారం సాగుతోంది.


ఆక్రమణలను అడ్డుకునేవారేరీ?

పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పర్వం జోరుగా సాగుతోంది. మర్రిపాలెం వుడా లే అవుట్‌లో స్థలాలకు రూ.కోట్లలో ధర పలుకుతోంది. ఇలాంటి చోట ఖాళీగా ఉన్న స్థలాన్ని ఇటీవల కొంతమంది చదను చేసి చెట్లు నరికేశారు. కొండను తొలిచి గ్రావెల్ కూడా తరలించారు. దీనిపై కాలనీలోని కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణ దారులు ప్రస్తుతం వెనక్కి తగ్గారు. వీఎంఆర్‌డీఏ, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో సర్వే చేస్తే ఆక్రమణలకు అడ్డకట్ట పడేఅవకాశం ఉందని కాలనీ వాసులు అంటున్నారు.

ఆ కంటైనర్ కథేంటో..

కరాసలో బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న స్థలంపై ప్రస్తుతం వివాదం సాగుతోంది. దీనిపై స్థల యజమాని న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించాడు. ఇదే సమయంలో ఆ స్థలం వద్ద ఓ కంటైనర్ పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ పంచాయతీ పోలీసు స్టేషన్ వరకు వెళ్లింది. దీని వెనుక కూటమి నేతలు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న స్థలాల విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే చేసి స్థల వివాదాలకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.



బీఆర్‌టీఎస్ రోడ్ పక్క స్థలంలో పెట్టిన కంటైనర్



మర్రిపాలెం వుడా లే అవుట్‌లో వీఎంఆర్‌డీఏ పెట్టిన బోర్డు

క్లుప్తంగా

ఘనంగా బుద్ధ జయంతి



చీరలు పంపిణీ చేస్తున్న అతిథులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలో బుద్ధ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. బౌద్ధ ప్రచారకులు ధర్మానంద ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బౌద్ధ ఉపాసకులు లక్ష్మీనారాయణ అతిథిగా పాల్గొని పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

జోన్-5 పీజీఆర్ఎస్‌కు నాలుగు వినతులు



అర్జీలు పరిశీలిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అర్జీలను స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 2, పబ్లిక్ హెల్త్ యూసీడీకి 1, రెవెన్యూ విభాగానికి 1 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం



ఎన్ఏడీ ప్లై ఓవర్‌పై కురుస్తున్న వర్షం

విశాఖ విద్య: వేసవి తాపంతో అల్లాడిన ప్రజానీకానికి సోమవారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షంతో ఉపశమనం కలిగింది. వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులు వీచాయి. కారుమబ్బులు కమ్ముకుని ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ప్రజలు హమ్మయ్యా అంటూ ఉత్సాహంగా గడిపారు.

ఎస్‌ఏబీఎఫ్‌కి వడ్డీ రేటు కొనసాగించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు పీఎఫ్ వల్లే సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్ఏబీఎఫ్)కు వడ్డీ రేటు కొనసాగించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు స్టీల్‌ప్లాంట్ సీఎండీకి సోమవారం లేఖ అందజేశారు.1995లో ఎస్ఏబీఎఫ్ ప్రవేశ పెట్టడం జరిగిందని అప్పటి నుంచి పీఎఫ్ వలే ఎస్ఏబీఎఫ్‌కి కూడా వడ్డీ చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందన్నారు. వివిధ బ్యాంకులకు కంపెనీ 14 శాతం వడ్డీ చెల్లిస్తుందన్నారు. అయితే ఉద్యోగుల ఎస్ఏబీఎఫ్‌కి 7.25 శాతం వడ్డీ చెల్లించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని పీఎఫ్ వలే 8.25 శాతం వడ్డీ కొనసాగించాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, అధ్యక్షులు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా endow& eokanaka@gov.in ఇ-మెయిల్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

ఘనంగా అన్నమాచార్యులు జయంతి



అన్నమాచార్యులు వేషధారణలో చిన్నారి

మల్కాపురం: వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులు జయంతిని సోమవారం61వ వార్డు వెంకన్నపాలెంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కోలాట గురువు నీలాతి గుణవతియాదవ్ ఆధ్వర్యంలో వెంకన్నపాలెం కృష్ణాలయంలో జరిగిన కార్యక్రమంలో చిన్నారులు,మహిళలు వచ్చి వేంకటేశ్వర స్వామి వారిపై వాగ్గేయకారులు తాళ్లపాక అన్నమాచార్యులు పాడిన కీర్తనలను ఆలపించారు. మహిళలు,చిన్నారులు నృత్యం చేశారు. వెంకన్నపాలెం పురవీధుల్లో సప్తగిరి సంకీర్తనలు ఆలపిస్తూ చిన్నారులు అన్నమాచార్యులు ఉత్సవమూర్తిని ఊరేగించారు.

వీధిదీపాలు వేయాలని వినతి

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు చైతన్యనగర్ కొండ ప్రాంతంలో వీధి దీపాల సమస్యను నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్ సోమవారం విద్యుత్ అధికారులతో పాటు మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.గణబాబు వినతులు అందించారు.దీనిపై వారు సానుకూలంగా స్పందించి వారంలోగా వీధి దీపాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

శరకం మహేష్‌పై పీడీ యాక్ట్

గోపాలపట్నం: పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న శరకం మహేష్‌పై నగర పోలీసులు పీడీ యాక్ట్ విధించారు. జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్‌కు చెందిన మహేష్‌పై పలు రకాల కేసులు నమోదయ్యాయి. గంజాయి తరలింపు వంటి పలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. మహేష్‌పై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు.

15 నుంచి పెంటమాంబ మహోత్సవాలు



పెంటమాంబ అమ్మవారు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్నాయి. పండగ నిర్వహణకు సంబంధించిన చాటింపు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్ దంపతులు అమ్మవారికి పసుపు,కుంకుమలతో అర్చన చేశారు. 15 నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని వివరించారు.ఉత్సవాల రోజుల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ముగింపు రోజు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించనున్నట్టు చెప్పారు.అదే రోజు భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

14న వాహనాల వేలం

కూర్మన్నపాలెం: వివిధ కారణాల వల్ల సీజ్‌చేసిన వాహనాలను ఈనెల 14వ తేదీన వేలం వేయనున్నట్లు దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు తెలిపారు. పోలీసుస్టేషన్ ఆవరణలో ఆరోజు ఉదయం 11 గంటలకు గాజువాక తహసీల్దార్ శ్రీ వల్లి ఆధ్వర్యంలో వేలం వేస్తామని ఆయన పేర్కొన్నారు. చాలా కాలం నుంచి పోలీసు స్టేషన్‌లో ఎటువంటి రికార్డులు లేకుండా అనేక వాహనాలు విడిచిపెట్టటం జరిగిందని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశాల మేరకు వేలం వేయాలని నిర్ణయించామని తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొన వచ్చునని పేర్కొన్నారు.

ఆచార్య.. నీటి సంరక్షణ ఇలాగేనా!





ఏయూలోని క్యాంపస్ కాలేజీల భవనాల వద్ద లీకవుతున్న తాగునీరు

- ఆంధ్రా యూనివర్సిటీలో తాగునీరు లీకేజీ
- పట్టించుకోని వర్సిటీ అధికారులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో తాగునీటిని వృథా చేస్తున్నారు. క్యాంపస్ కాలేజీలు, వసతి గృహ భవనాల వద్ద పైప్‌లైన్ల లీకేజీతో రోజంతా నీరు వృథాగా పోతోంది. భవనాలపై ఉన్న ట్యాంకులకు నీటిని ఎక్కించేందుకు మోటార్లు వేసి, అలానే గంటల తరబడి వదిలేస్తుండటంతో నీరంతా పొంగి గోడలు తడచి కిందకు పారుతోంది. తాగునీటి కొరత కారణంగానే క్యాంపస్ హాస్టళ్లల్లో ఉంటూ, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు పంపించేస్తున్నామని యూనివర్సిటీ అధికారులు ప్రకటించారు. వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. క్యాంపస్‌లోని కాలేజీలు, వసతి గృహాల వద్ద ట్యాంకులన్నీ నీటితో పొంగి, కిందకు పోతున్నాయి. లీకేజీతో పైపుల్లో నీరు ఆకాశాన్ని అంటుతున్నట్లుగా పైకి పొంగుతోంది. సోమవారం ఏయూలో ఎక్కడ చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. వీటిని తమ సెల్‌ఫోన్లలో బంధించిన కొంతమంది విద్యార్థులు, వర్సిటీ అధికారులకు చూపించేందుకు ప్రయత్నించారు. అధికారులు మాత్రం విద్యార్థులను పట్టించుకోలేదు. స్టూడెంట్లను యూనివర్సిటీ నుంచి బయటకు పంపించేయడమే లక్ష్యమన్నట్లుగా నీటి కొరత ఉందని ఏయూ అధికారులు సాకులు చెబుతున్నారని విద్యార్థులు అంటున్నారు. ఏదేమైనా నీటి సంరక్షణలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని చెబుతున్నారు.

ముగిసిన బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 8న స్వామి తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం అష్టోత్తర శత కలశ స్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థ నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీరరాఘవాచార్యులు, గొడవర్తి రామచంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం కళశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం చేశారు. ముందుగా పూర్ణాహుతి జరిపారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా చక్రస్నానాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం ధ్వజారోహణం జరిపారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో బల్లిగిరి మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవరం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు.

పూడికల తొలగింపు



వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పైడిమాంబ కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను సోమవారం పారిశుధ్య కార్మికులు తొలగించారు. టిడ్కో ఇళ్లకు ఆనుకుని ఉన్న రోడ్లు, కాలువలు అపరిశుభ్రంగా మారడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం వ్యర్థాలమయం అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో కార్మికులు కాలనీలో వ్యర్థాలు, డ్రైనేజీల్లో పూడికలు తొలగించారు. దీంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.17.46 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 46 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించిన ఆదాయం కలిపి రూ.17,46,974 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు ఎం.నీలిమ, పి.శేఖర్‌బాబు పర్యవేక్షణలో దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ డే



కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

అగనంపూడి: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నర్సింగ్ సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించి ప్రతిజ్ఞ చేశారు. తర్వాత కేక్‌కట్ చేసి సంబరాలు చేశారు. మదర్ థెరిసా, ఫ్లోరెన్స్ నైటింగేల్ వంటి వారి సేవల వల్ల నర్సులకు మంచి గుర్తింపు వచ్చిందని నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి అన్నారు. కరోనా రోజుల్లో నర్సులు వైద్యులతోపాటు ప్రాణాలొడ్డి సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులకు భంగం



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి,వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్,ఏఐటీయూసీ నాయకుడు సత్యనారాయణ ఆరోపించారు.ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయడం, కార్మిక హక్కులను హరించే విధంగా లేబర్ కోడ్స్ తీసుకువస్తున్న తరుణంలో వాటిని వ్యతిరేకిస్తూ అఖిల పక్షల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా కార్మికులను సన్నద్ధం చేయడానికి సోమవారం హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలనే యోచనతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న పరిశ్రమలను ఆదుకోవాల్సిన కేంద్రం వాటిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడం ఏంటని ప్రశ్నించారు. అలాగే దేశవ్యాప్తంగా ఉన్న కార్మిక సమస్యలను పరిష్కరించాల్సిది పోయి వారి హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. దీనిలో భాగంగా ఈ నెల 20న జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎస్.తాతబాబు,పైడిరాజు,వాసు,ఏసుబాబు,గంగాధర్,శ్రీను,రాజు,నీలయ్య,ప్రసాద్,దాసు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ఎన్ఏడీ సెంటర్‌లోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఫస్టియర్, మధ్యాహ్నం సెకెండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు కావడంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు సైతం పరీక్ష కేంద్రాలకు వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడిగా మారింది. పరీక్షల నేపథ్యంలో కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

నిబంధనలు మీరితే కఠిన చర్యలు

పెందుర్తి: సమయ పాలన పాటించకుండా, నిబంధనలు అతిక్రమించి బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆయా వ్యాపారాలు నిబంధనలు విరుద్ధంగా జరిగితే తక్షణమే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. సోమవారం పెందుర్తి సర్కిల్ పరిధిలోని బార్‌లు, మద్యం దుకాణాలు, హోటళ్ల యాజమాన్యాలకు సమయ పాలన, అనధికారిక విక్రయాలపై నోటీసులు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం విక్రయాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు, బార్‌లు రాత్రి 11 గంటల వరకు మాత్రమే మద్యాన్ని విక్రయించాలన్నారు. హోటళ్లు రాత్రి 12 గంటల వరకే ఆహారాన్ని అందించాలని సూచించారు. నిబంధనలు మీరితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రతి దుకాణానికి లైసెన్స్, ఫైర్ ఎన్‌వోసీ, జీవీఎంసీ/పంచాయతీ అనుమతితో పాటు ఆయా వ్యాపార సంస్థల్లో పనిచేసే సిబ్బంది కాండక్ట్ ధ్రువీకరణ పత్రం తమ నుంచి తీసుకోవాలని సూచించారు.